
# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME :129 EDITOR:CHERUKU UPENDAR, DATE : SUNDAY 17 SEPTEMBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 129 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : ఆదివారం 17 సెప్టెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-


## 23న వన్ నేషన్ భేటీ



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

ఒకే దేశం, ఒకే ఎన్నికపై అధ్యయనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ప్రత్యేకంగా ఓ కమిటీ ఏర్పాటు చేసింది. ఇప్పటికే కసరత్తు మొదలు పెట్టిన ఈ కమిటీ...కీలక ప్రకటన చేసింది. సెప్టెంబర్ 23న తొలిసమావేశం నిర్వహించనున్నట్టు స్వయంగా రామ్‌నాథ్

మిగతా 2లో...

## యశోభూమి
## ప్రారంభోత్సవం



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం తన పుట్టినరోజు సందర్భంగా కీలక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టబోతున్నారు. ద్వారకలో అత్యాధునిక సౌకర్యాలతో 'యశోభూమి' పేరుతో నిర్మించిన ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (ఐఐసిసి) ను ప్రధాని మోడీ ప్రారంభించనున్నారు. ద్వారకా సెక్టార్ 21 నుంచి ద్వారకా సెక్టార్ 25 వద్దనున్న కొత్త మెట్రో స్టేషన్ వరకు..

మిగతా 2 లో...

## ఐదు రాష్ట్రాల ఎన్నికలే... అజెండా








- హైదరాబాద్‌లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం
- అగ్రనేతలు ఖర్గేతోపాటు సోనియా, రాహుల్, ప్రియాంక హాజరు
- పార్టీ అధికారమే లక్ష్యంగా కూటమి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

చాలా ఏళ్ల తరువాత హైదరాబాద్ లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం ప్రారంభమైంది. ఈ సమావేశానికి కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో పాటు అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంకాగాంధీ హాజరుకాబోతున్నారు. వీరితో పాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, ఇతర ప్రముఖ నాయకులు వస్తున్నారు. ఖర్గే అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత జరుగుతున్న తొలి సీడబ్ల్యూసీ సమావేశం ఇదే. కాగా ఈ సమావేశంలో రాబోయే 5 రాష్ట్రాల ఎన్నికలే ప్రధాన ఎజెండాకా చర్చ జరుగుతోందిఈ ఏడాది చివర్లో జరిగే 5 రాష్ట్రాల ఎన్నికలపై కాంగ్రెస్ దృష్టి సారిస్తోందని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే

మిగతా 2 లో...

## కేసీఆర్‌కు
## బీజేపీ కౌంటర్




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

సెప్టెంబర్ 18 నుంచి 22వ తేదీ వరకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధాని మోదీకి లేఖ రాశారు. చట్టసభల్లో 33 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును.. అలాగే 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అయితే దీనికి తెలంగాణ బీజేపీ కౌంటర్ ఇచ్చింది. .

మిగతా 2 లో...

## ఎన్నికలు సంగతేంటీ..!

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




అసెంబ్లీ ఎన్నికలెప్పుడు? రాష్ట్రంలో ఇప్పుడిదే హాట్ టాపిక్! షెడ్యూల్ ప్రకారం డిసెంబర్‌లో ఎలక్షన్లు జరుగుతాయా? లేక ఆలస్యమవుతాయా? వచ్చే ఏడాది ఏప్రిల్, మే నెలల్లో పార్లమెంట్ ఎన్నికలతోపాటే 'జమిలి'కి చాన్స్ ఉందా? అనే కన్ఫ్యూజన్ కొనసాగుతున్నది. రాష్ట్రంలో రాజకీయ పార్టీలన్నీ ఈ సందేహాలతోనే వెనుకా ముందు ఆడుతున్నాయి. అక్టోబర్ 12లోగా షెడ్యూల్ రాకుంటే ఇప్పట్లో ఎన్నికలు జరిగేది అనుమానమేనని, జమిలి ఎన్నికలు రావచ్చుని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంకేతాలు ఇచ్చారు. బీజేపీ నేతలు మాత్రం షెడ్యూల్ ప్రకారమే రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతాయని పదేపదే చెప్తున్నారు.

మిగతా 3 లో...

## కాంగ్రెస్‌ను
## ప్రజలు నమ్మడం లేదు
### మంత్రి హరీష్ రావు



పటాన్ చేరు- ప్రభాత సూర్యుడు

ఆకలైనప్పుడు అన్నం పెట్టడం చేతకాని కాంగ్రెస్కు ఓట్ల కోసం గోరుముద్దలు తినిపిస్తామంటే ప్రజలు నమ్మరని మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ పై మండిపడ్డారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన మైనార్టీ బంధు , బీసీ బంధు లబ్ధిదారుల తోపాటు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను మంత్రి పంపిణీ చేసారు. ఆదేవిధంగా జి వో నంబర్ 58,59 ద్వారా లబ్ధిదారుల కు రెగ్యులైజేషన్ మంజూరు పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో

మిగతా 2 లో...

## 40 దశాబ్దాల కల నెరవేరింది

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని సీఎం కేసీఆర్ శనివారం ప్రారంభించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం నార్లాపూర్ వద్ద నిర్మించినటవంటి మొదటి దశ ఎత్తిపోతల్లోని పంపు మీటనొక్కి ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలను ప్రారంభించారు. శ్రీశైలం వెనుక ఉన్నటువంటి నీటి ఆధారంగా కృష్ణా నది నుంచి కోతిగుండు ద్వారా నీటిని తీసుకునేలా ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. 60 రోజుల్లోనే ఏకంగా 90 టీఎంసీల నీటిని తరలించేందుకు వీలుగా అయిదు ఎత్తిపోతలను, ఆరు జలాశయాలను నిర్మించారు. ఇందులో భాగంగానే మొదటి పంపుహౌసులో తొలి పంపును సిద్ధం చేశారు. భూగర్భంలో పంపుహౌస్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఉపరితలంపై ఏర్పాటు చేసినటువంటి కంట్రోలింగ్ కేంద్రం నుంచి పంపు మీట నొక్కి నీటి ఎత్తిపోతను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టుపై

మిగతా 3 లో...

## ఏ 29గా నవదీప్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

టాలీవుడ్ లో ఇదివరకే డ్రగ్స్ కేసు కలకలం కేపింది. తాజాగా మరోసారి మాదాపూర్ డ్రగ్స్ కేసులో సినీ ఇండస్ట్రీకి లింకులు ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మాదాపూర్ డ్రగ్స్ కేసులో హీరో నవదీప్ కు ఊహించని షాక్ తగిలింది. ఈ డ్రగ్స్ కేసుతో నవదీప్ కు సంబంధం ఉందని పోలీసులు వెల్లడించారు. నవదీప్ డ్రగ్స్ సేవించినట్లుగా హైదరాబాద్ పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో 29వ నిందితుడిగా

మిగతా 2లో...

## ఒక పేపర్ బదులు మరో పేపర్
## టెట్ పరీక్షలో వింత



కరీంనగర్- ప్రభాత సూర్యుడు

టెట్ పరీక్ష జరిగిన సంగతి తెలిసిందే. అయితే కొన్ని పరీక్ష కేంద్రాల్లో అధికారుల నిర్లక్ష్యం వల్ల ఒక పేపర్?కు బదులు మరో పేపర్ ఇవ్వడంతో గందరగోళం నెలకొంది. ఇక వివరాల్లోకి వెళ్తే సిరిసిల్ల పట్టణంలోని పలు పాఠశాలలో నిర్వహిస్తున్న టెట్ పరీక్ష కేంద్రాలలో సైన్స్ పేపర్?కు బదులు ఎన్విరాన్మెంట్ పేపర్?ను అభ్యర్థులకు ఇన్విజిలేటర్లు ఇచ్చారు. అప్పటికే అభ్యర్థులు 40 ప్రశ్నలకు సమాధానం దిద్దిన క్రమంలో సుమారు నలభై నిమిషాల తర్వాత పేపరు మారిందని జిల్లా గుర్తించిన అధికారులు అభ్యర్థులకు మ్యాథ్స్, సైన్స్ పేపర్ ఇచ్చారు. దాంతో

మిగతా 2 లో...

## ఛేరికలు ఉన్నట్టా... లేనట్టా...

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



తెలంగాణ భారతీయ జనతా పార్టీ కన్ఫ్యూజన్‌లో ఉన్నట్లుంది. వారు తీసుకుంటున్న నిర్ణయాలే ఇందుకు అద్దం పడుతున్నాయి. చేరికలు లేవని బాధపడుతూ ఎవరినంటే వారిని పార్టీలో చేర్చుకునేందుకు సిద్ధమవుతుండటం పార్టీలో హాట్ టాపిక్ గా మారింది. తెలంగాణ బీజేపీ మొన్నటి వరకూ బలంగా ఉండేది. బీఆర్ఎస్ ను ఎదుర్కొనేది బీజేపీ అన్నంత బిల్డప్ ఇచ్చింది. అది భ్రమ అని తేలింది. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో కాంగ్రెస్ అనూహ్యంగా పుంజుకోవడంతో బీజేపీ చాలా దూరం వెనకబడి పోయిందనే చెప్పాలి. నాలుగేళ్ల ముందు

మిగతా 2లో...

# యశోభూమి ప్రారంభోత్సవం

(మొదటి పేజీ తరువాయి)
ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ మెట్రో ఎక్స్‌ప్రెస్ లైన్ ను కూడా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. దీనికోసం కేంద్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. దేశరాజధానిలో యశోభూమి ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది.

**యశోభూమి కన్వెన్షన్ సెంటర్ ప్రత్యేకతలు..**

యశోభూమి కేంద్రం రూ. 4,400 కోట్ల వ్యయంతో 73,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించారు. ప్రధాన ఆడిటోరియంతో సహా 15 సమావేశ గదులు ఉన్నాయి. ఇది ఒక గ్రాండ్ బాల్‌రూమ్, 11,000 మంది ప్రతినిధులు కూర్చునే సామర్థ్యంతో ఈ 13 సమావేశ గదులను నిర్మించారు. యశోభూమిలో అత్యంత విస్తృతమైన ఒఇఅ మీడియా విభాగాన్ని కూడా నిర్మించారు. సుమారు 2,500 మంది అతిథులకు వసతి కల్పించగల విశాలమైన బాల్‌రూమ్‌తో.. పెద్ద పెద్ద ఈవెంట్‌లు నిర్వహించుకునేలా అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించారు. అదేవిధంగా అక్కడున్న వారందరికి భరోసా కల్పించేలా వేదిక వద్ద అత్యాధునిక భద్రతా చర్యల కోసం ఏర్పాట్లు చేశారు. అదనంగా, కన్వెన్షన్ సెంటర్‌లో 1,07,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఎగ్జిబిషన్ ప్రాంతం కూడా ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్ట్ ప్రపంచంలోనే అతిపెద్ద సమావేశాలు, ప్రోత్సాహకాలు, సదస్సులు, ప్రదర్శనల (ఓఎఅఇ) కోసం సౌకర్యవంతం చేసేలా మోడీ ప్రభుత్వం తీర్చిదిద్దింది. ప్లీనరీ హాల్ సుమారు 6,000 మంది అతిథులు కూర్చునే సామర్థ్యంతో నిర్మించారు. 'యశోభూమి ద్వారకా సెక్టార్ 25' ప్రారంభోత్సవంతో ఇది కొత్త మెట్రో స్టేషన్ నుంచి ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ మెట్రో ఎక్స్‌ప్రెస్ లైన్‌కు అనుసంధానించే ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టనున్నారు.

**యశోభూమి ద్వారకా సెక్టార్-25 మెట్రో స్టేషన్:**

స్టేషన్ ప్రారంభోత్సవం తర్వాత అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి రాకపోకలకు అనుమతించనున్నారు. రాబోయే మెట్రో స్టేషన్‌లో మూడు సబ్‌వేలు ఉంటాయి: ఒకటి 735 మీటర్ల పొడవుతో స్టేషన్‌ను ఎగ్జిబిషన్ హాల్స్, కన్వెన్షన్ సెంటర్, సెంట్రల్ అరేనాతో అనుసంధానిస్తుంది. రెండవ సబ్‌వే ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే మీదుగా ఉన్న ఎంట్రీ/ఎగ్జిట్ పాయింట్‌లకు అనుసంధానించారు. మూడవది మెట్రో స్టేషన్‌ను యశోభూమి భవిష్యత్తు ఎగ్జిబిషన్ హాల్స్ ఫోయర్‌కు కలుపుతుందని ప్రకటనలో తెలిపారు.. న్యూ ఢిల్లీ స్టేషన్ నుంచి 'యశోభూమి ద్వారకా సెక్టార్ 25' వరకు మొత్తం ప్రయాణం దాదాపు 21 నిమిషాలు పడుతుంది.

# కేసీఆర్‌కు బీజేపీ కౌంటం

(మొదటి పేజీ తరువాయి)
బీఆర్‌ఎస్‌లో వందమంది ఎమ్మెల్యేలు ఉంటే.. అందులో మహిళా ఎమ్మెల్యేలు 5 శాతం మాత్రమే ఉన్నారని విమర్శలు చేసింది. అలాగే బీఆర్ఎస్ ఎంపీలు 16 మంది ఉంటే అందులో ఒక్కరే మహిళా ఎంపీ ఉన్నట్లు పేర్కొంది. ఎమ్మెల్యేలు, ఎంపీలు కలిపినా 33 శాతం కావడం లేదంటూ విమర్శించింది. అసెంబ్లీ, పార్లమెంట్ సభ్యుల్లో 33 శాతం మహిళలు ఉండాలనే విషయం కేవలం ఫామ్‌హౌస్ ప్లానింగ్‌లోనే ఉందని రియాల్టీలో మాత్రం చాలా దూరంగా ఉందంటూ ఎద్దేవా చేస్తూ ట్వీట్ చేసింది. ఇదిలా ఉండగా శుక్రవారం రోజున ప్రగతి భవన్‌లో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సంయుక్త సమావేశం జరగగా? ఈ అంశంపై ఏకగ్రీవంగా తీర్మానిస్తూ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రత్యేక సమావేశాల్లో సభ ముందుకు ఈ రెండు బిల్లులను తీసుకురావాలని కోరారు. బీసీ(ఓబీసీ) బిల్లు, మహిళా బిల్లను పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టేలా.. బీఆర్ఎస్ ఎంపీలు చేపట్టాల్సిన కార్యచరణపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. అలాగే మహిళా సంక్షేమం కోసం, బీసీల అభ్యున్నతి కోసం బీఆర్ఎస్ పార్టీ కట్టుబడి ఉన్నట్లు.. దేశవ్యాప్తంగా.. వారి హక్కులు కాపాడేలా కేంద్రాన్ని ప్రభుత్వంపై బీఆర్ఎస్ ప్రశ్నిస్తూనే ఉంటుందని కేసీఆర్ స్పష్టం చేశారు. అలాగే తరతరాలుగా కుల వృత్తులు చేస్తూ.. దేశ సంపద సృష్టిలో కీలకంగా భాగస్వాములైన బీసీలకు చట్టసభల్లో ప్రాధాన్యం కల్పించేలా కేంద్రం ముందుకు సాగాలని కోరారు. బీబీసీ(ఓబీసీ)లను విద్య, ఆర్థిక అలాగే సామజిక రంగాల్లో ముందుకు నడిపించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని అన్నారు. తెలంగాణలో బీసీల సంక్షేమం కోసం అమలు చేస్తున్నటువంటి ఫథకాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని పేర్కొన్నారు.తెలంగాణ మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ బిల్లుకు ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్రానికి పంపినట్లు గుర్తుచేశారు. ఇది పంపి తొమ్మిది సంవత్సరాలు గడిచినా కూడా కేంద్రం స్పందిచలేదని అన్నారు. చట్టసభల్లో బీసీలకు సరైన ప్రాధాన్యం దక్కినప్పుడే వారి సమ్మిళిత అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం చేయకుండా.. బీసీ బిల్లును ఆమోదించే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు సమావేశాల్లో బీఆర్ఎస్ డిమాండ్లను.. రాజ్యసభ, లోక్‌సభల్లో లేవనెత్తాలని పార్టీ ఎంపీలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. ఇదిలా ఉండగా ఇదిలా ఉండగా సెప్టెంబర్ 18 నుంచి జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సమావేశాల్లో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో.. ఏ ఏ బిల్లులు ప్రవేశపెడతారో అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. గత కొన్ని రోజుల నుంచి.. ఉమ్మడి పౌర స్మృతి బిల్లు, వన్ నేషన్ వన్ ఎలక్షన్ లాంటి బిల్లులు ప్రవేశపెట్టే ఆలోచనలో కేంద్రం ఉందంటూ ప్రచారాలు సాగాయి. అయితే ఏం జరుగుతుందో తెలియాలంటే సమావేశాలు జరిగే వరకు వేచి చూడాల్సిందే.

# ఐదు రాష్ట్రాల ఎన్నికలే అజెండా

(మొదటి పేజీ తరువాయి)
తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు సమావేశం ప్రారంభమైంది. ఈ ఏడాది చివర్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గడ్, తెలంగాణ, మిజోరాం రాష్ట్రాల ఎన్నికలు జరగనున్నాయి. ముఖ్యంగా తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ పార్టీకి పేరుంది. అయితే తెలంగాణ వచ్చిన తర్వాత రెండుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయింది. ఈ నేపథ్యంలో ఈ సారి తప్పకుండా ఎన్నికల్లో గెలిచి సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీని గద్దె దించాలని అనుకుంటోంది. ఇలా ఢిల్లీకి వెలుపల హైదరాబాద్ లో కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశం నిర్వహించడం చూస్తే ఈ సారి తెలంగాణ ఎన్నికల్లో గెలుపు ఆ పార్టీకి ఎంత కీలకమో తెలుస్తోంది. ఈ సమావేశాల్లోనే కాంగ్రెస్ పార్టీ తన 6 హామీలను ప్రకటించనుంది. ఇదిలా ఉంటే రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికలు కూడా కాంగ్రెస్ కి కీలకంగా మారాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ ఎంపీ సీట్లు సాధించాలంటే ఈ అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం రాజస్థాన్, చత్తీస్‌గడ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉంది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉంది.

**ఇండియానే ముఖ్యం**

ఎన్నో ప్రాణత్యాగాలు చేసిన కాంగ్రెస్ పార్టీకి సీట్ల త్యాగాలు పెద్ద లెక్కేముంది.. దేశం ముఖ్యం.."ఇండియా" కూటమి లక్ష్యం అదే అన్నారు సీడబ్ల్యూసీ సభ్యులు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి.. నాలుగేళ్ల సెలవు తర్వాత, నేను ఏమీ అడగకుండానే పార్టీ అధినాయకత్వం గురుతర బాధ్యతలు ఇచ్చింది. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీకి ఈసారి రాష్ట్ర ప్రజలు.. కాంగ్రెస్ పార్టీని గెలిపించి బహుమతిగా ఇవ్వాలనే ఉద్దేశంతో ఉన్నారని తెలిపారు.. అందుకే హైదరాబాద్ లో కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక సీడబ్ల్యూసీ సమావేశాలు నిర్వహిస్తోందన్న ఆయన.. కర్నాటక లో ఘన విజయంతో కాంగ్రెస్ పూర్వ వైభవం పునఃప్రారంభమైంది. తర్వాత తెలంగాణలో అధికారంలోకి రావడం, తదనంతరం ఏపీలో బలపడడం ఖాయం.. దేశం పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందనే విశ్వాసం నాకుందన్నారు రఘువీరారెడ్డి.కాంగ్రెస్ పార్టీతో సహా "ఇండియా" భాగస్వామ్య పక్షాలు సమిష్టిగా లోకసభ ఎన్నికల్లో విజయం సొంతం చేసుకోవడం ఖాయం అన్నారు రఘువీరా.. "ఇండియా" కూటమి ఐక్యతను చూసి, పోటీగా ఎన్డీఏ కూటమి సమావేశాన్ని బీజేపీ నిర్వహించిందని దుయ్యబట్టారు.. గతంలో ఏనాడు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలను సంప్రదించని బీజేపీ.. "ఇండియా"ను చూసి భయంతోనే అత్యవసర సమావేశం ఏర్పాటు చేసిందని ఆరోపించారు రఘువీరారెడ్డి.. కాగా, ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం తర్వాత కాంగ్రెస్ పార్టీలో అత్యంత ఉన్నత స్థాయి విధాన నిర్ణయాక సంఘం సీడబ్ల్యూసీ సభ్యుడుగా ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి నియామకమైన ఏకైక నాయకుడు రఘువీరారెడ్డి కావడం విశేషంగా చెప్పుకోవాలి.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో గతంలో కోట్ల విజయభాస్కరరెడ్డి, ఎమ్మెస్సార్ సీడబ్ల్యూసీలో సభ్యులుగా ఉన్న విషయం విదితమే.

# ఒక పేపర్ బదులు మరో పేపర్ టెట్ పరీక్షలో వింత

(మొదటి పేజీ తరువాయి)
అభ్యర్థులు ఆందోళన చేయగా ఓఎంఆర్ షీట్?పై వైట్నర్ తో రబ్ చేసి పరీక్ష రాయాలని అధికారులు అభ్యర్థులకు చెప్పారు. ప్రశ్నించిన కొందరు అభ్యర్థులను పరీక్ష హాల్ బయట పరీక్షలు రాయించిన అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు.జిల్లాలో టెట్ నిర్వహణలో తలెత్తిన సమస్యపై విద్యాధికారి రమేశ్ కుమార్ స్పందించారు. ప్రశ్నాపత్రాలు మారిన మాట వాస్తవమని, ఓఎంఆర్ షీట్లో ఆన్సర్లు రాసిన వాటిని సరిచేయడానికి ఉన్నతాధికారుల ఆదేశాలతోనే ఓఎంఆర్ షీట్లో వైట్నర్ ఉపయోగించేలా అనుమతిని ఇవ్వడం జరిగిందనీ అభ్యర్థులు వైట్నర్ వాడడంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అభ్యర్థులు రాసిన జవాబు పత్రాలను ఆన్లైన్‌లో పెడుతామని, అప్పుడు రాసిన జవాబులకు ఇచ్చిన మార్కులను అభ్యర్థులు చూసేందుకు వీలుంటుందన్నారు. రాష్ట్ర ఉన్నతాధికారులతో చర్చించిన తర్వాతే అన్ని విషయాలను వెల్లడిస్తున్నట్లు తెలిపారు. అన్యాయం జరిగితే అధికారులే బాధ్యులు అవుతారని టెట్ నిర్వహణలో తీసుకున్న తాత్కాలిక ఉపశమన మార్గాలతో ఎవరికీ అన్యాయం జరగకూడదని విపక్ష నేతలు చెబుతున్నారు. అనంతరం డీఈఓ?కు జరిగిన తప్పిదాలను టెట్ అభ్యర్థులు లిఖితపూర్వకంగా రాసి వినతి పత్రం సమర్పించారు.

టెట్ అభ్యర్థులు కలెక్టరేట్ చేరుకుని డీఈవో రమేశ్?తో మాట్లాడారు. అధికారులు తప్పిదాలు చేసిన విషయం వాస్తవం అయినప్పుడు అలాంటి అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పడికే పోలీసులు నిర్బంధించడంతో ఏమి చేయలేని పరిస్థితుల్లో అభ్యర్థులు అధికారులు సూచించినట్లు పరీక్ష రాసి వచ్చారు. అన్ని పరీక్ష కేంద్రాలలో టెట్ పరీక్ష ఐదు గంటలకే ముగిస్తే పరీక్ష మారిన కేంద్రాల్లో మాత్రం ఆరు గంటల వరకు నిర్వహించారు. పరీక్ష రాసిన తరువాత అభ్యర్థులు వారి కుటుంబ సభ్యులు పరీక్ష కేంద్రాల వద్ద నిరసనకుదిగారు. వాస్తవానికి పరీక్షా కేంద్రం వద్ద ధర్నా చేసిన అఖిల పక్షం నాయకులు. ఓఎంఆర్ షీట్?పై వైట్నర్ తో దిద్దితే కంప్యూటర్ గుర్తించదని తీవ్రంగా ఆందోళన చేశారు. పరీక్ష కేంద్రాల వద్దకు అఖిలపక్ష, వామపక్ష నాయకులు చేరుకొని పరీక్ష కేంద్రాల ముందు బైఠాయించి అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న నేతలను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించారు.

**27న టెట్ ఫలితాలు**

తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) సెప్టెంబరు 15న సజావుగా ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన టెట్ పేపర్-1 పరీక్షకు 84.12 శాతం, మధ్యాహ్నం నిర్వహించిన పేపర్ -2 పరీక్షకు 91.11 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. గతంలో కఠినంగా వచ్చే పేపర్-1 ప్రశ్నపత్రం ఈసారి సులభంగా వచ్చింది. పేపర్-2 మాత్రం కఠినంగా ఇచ్చారు. దీనిలో కొన్ని ప్రశ్నలు అత్యంత కఠినంగా ఉన్నాయి. టెట్ పేపర్-1 పరీక్షకు 2,69,557 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 2,26,744 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇక పేపర్-2 పరీక్షకు 2,08,498 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 1,89,963 మంది అభ్యర్థులు హాజరయ్యారు. టెట్ ప్రాథమిక కీని మూడు, నాలుగు రోజుల్లో వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. తాజా సమాచారం ప్రకారం వినాయక చవతి తర్వాతే కీని విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. తొలుత అభ్యంతరాలు స్వీకరించి, తుది కీ ప్రకటించనున్నారు. అయితే అక్కడక్కడ ఓఎమ్మార్ షీట్ల పంపిణీలో తప్పిదాలు జరిగాయి.ఈ పరీక్షల ఫలితాలు ఈ నెల 27న విడుదలకానున్నాయి. ఇదిలా ఉండగా, సిరిసిల్ల జిల్లా కేంద్రంతోపాటు కొన్నిచోట్ల ఒక పేపర్‌కు బదులు మరో పేపర్.. ఒక అభ్యర్థికి బదులు మరో అభ్యర్థి ఓఎమ్మార్‌ను పంపిణీ చేయడం, ఆ తర్వాత తప్పిదాలు జరిగినట్టుగా గుర్తించడంతో వైట్‌నర్‌తో చెరిపివేశారు. వైట్‌నర్ వాడిన ఓఎమ్మార్ షీట్లు చెల్లుబాటవుతాయని, అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

# ఛేరికలు ఉన్నట్టా... లేనట్టా...

(మొదటి పేజీ తరువాయి)
వరకూ రన్నింగ్ రేసులో రెండో స్థానంలో ఉందని పించుకున్న బీజేపీ గోల్ రీచ్ అయ్యే సమాయానికి మాత్రం అలసటతో చతికలపడిందనే చెప్పాలి. అందుకు వారు తీసుకుంటున్న హడావిడి నిర్ణయాలు.. ఆ తర్వాత మార్పులు పార్టీ నేతల బలహీనతను చాటి చెబుతున్నాయి. చీకోటి ప్రవీణ్, కృష్ణ యాదవ్ లను పార్టీలో చేర్చుకునేందుకు అగ్ర నేతలు సిద్ధమయ్యారు. ఎవరో ఒకరు చేరితే చాలు ఆర్థికంగానే కాకుండా సామజికవర్గంగా కూడా కొంత బలం చేకూరుతుందని విశ్వసించారు. కానీ సొంత పార్టీ నేతలే వారి రాకను వ్యతిరేకించారు. ఒకరు కేసినో ఆడిస్తూ ఈడీ విచారణ ఎదుర్కొన్న చికోటి ప్రవీణ్ కాగా, మరొకరు నకిలీ స్టాంప్ కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న కృష్ణ యాదవ్.. వీరద్దరి చేరిక విషయంలో బీజేపీ నేతల వ్యవహారం పార్టీకి తలవొంపులు తెచ్చి పెట్టిందనే చెప్పాలి. కృష్ణయాదవ్ నకిలీ స్టాంప్ కుంభకోణం కేసులో అరెస్టయి చంద్రబాబు హయాంలో మంత్రిపదవిని కోల్పోయారు. అప్పటి నుంచి ఆయన రాజకీయంగా ఎదగలేకపోయారు. అధికార బీఆర్ఎస్ లో చేరినా ఆయనకు ఎలాంటి పదవిని ఆ పార్టీ అప్పగించలేదు. ఆయన అవసరం ఎంత వరకో అంత వరకే గులాబీ పార్టీ చూసుకుంది తప్ప పెద్ద పదవులు ఇచ్చి చెడ్డ పేరు తెచ్చుకునే ప్రయత్నం చేయలేదు. కానీ బీజేపీ మాత్రం ఏమీ అర్థం కాని స్థితిలో ఆయనను చేర్చుకునేందుకు ముందుకు రావడం, అభ్యంతరాలు వెలువడటంతో వెనక్కు తగ్గడంతో ఉన్న పరువు కూడా పోగొట్టుకున్నట్లయింది. చికోటి ప్రవీణ్ చేరిక కూడా ఇందుకు భిన్నంగా జరగలేదు. అసలు పార్టీకి వారిని చేర్చుకోవాల్సిన అవసరం ఏంటన్న ప్రశ్న నేతల నుంచే ఎదురవుతున్నాయి. చికోటి ప్రవీణ్ ను చేర్చుకుంటే తాము రాజీనామా చేస్తామని బీజేపీ కార్పొరేటర్లు హెచ్చిరించినట్లు కూడా వార్తలు వచ్చాయి. ఈనేపథ్యంలోనే పరువు పోతుందని గ్రహించి ఇద్దరినీ చేర్చుకోకుండా వెనక్కు తగ్గారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వాళ్ల చేరికతో ఎంతమాత్రం లాభం లేకపోగా పార్టీ సిద్ధాంతాలకు, విధానాలకు తిలోదకాలిచ్చినట్లవుతుందని ఎక్కువ మంది నేతలు అభిప్రాయపడుతున్నారు. మరి బీజేపీ నేతలు వీరిద్దరి చేరికపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

# 23న వన్ నేషన్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)
కోవింద్ వెల్లడించారు. ఇప్పటికే దీనిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుండగా.. .రామ్‌నాథ్ చేసిన ఈ ప్రకటన ఆసక్తి రేపుతోంది. సెప్టెంబర్ 1వ తేదీన ఈ ప్యానెల్‌ని ఏర్పాటు చేసింది కేంద్రం. ఇప్పటి వరకూ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు వేరువేరుగా జరుగుతున్నాయి. ప్రతి రాష్ట్రంలో ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఇదే విధానాన్ని చాలా ఏళ్లుగా అనుసరిస్తున్నారు. అయితే...ఇలా వేరువేరుగా కాకుండా ఒకేసారి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు నిర్వహించాలన్నదే ఒకే దేశం, ఒకే ఎన్నిక ముఖ్య లక్ష్యం. దాదాపు నెల రోజులుగా దీనిపై కేంద్రం కసరత్తు చేస్తోంది. ఈ నెల 18-22 వరకూ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు పిలుపునిచ్చింది. ఈ సమావేశాల్లోనే ఒకే దేశం, ఒకే ఎన్నిక బిల్‌ని ప్రవేశపెడతారని తెలుస్తోంది. ఒకవేళ ఈ బిల్ పాస్ అయితే...లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరుగుతాయి. అయితే.. ఈ బిల్ పాస్ అవ్వాలంటే లోక్‌సభ సభ్యుల్లో 67% మంది మద్దతు కావాలి. అటు రాజ్యసభలోనూ 67% మంది సపోర్ట్ అవసరం. ఇక 50% ఎమ్మెల్యేల మద్దతూ కావాల్సిందే. ఎలాగైనా ఈ బిల్‌ని పాస్ చేయించాలన్న పట్టుదలతో ఉంది బీజేపీ. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఈ ప్రక్రియలో పారదర్శకత పెరగడంతో పాటు ఖర్చు తగ్గుతుందని చెబుతోంది.

# ఏ 29గా నవదీప్

(మొదటి పేజీ తరువాయి)
నవదీప్ పేరు చేర్చినట్లు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ కేసులో ఇదివరకే ఫిల్మ్ ఫైనాన్షియర్ వెంకటరమణారెడ్డితో పాటు డియర్ మేఘ చిత్ర దర్శకుడు అనుగు సుశాంత్ రెడ్డి ని అరెస్ట్ చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. నవదీప్ స్నేహితుడు రాంచంద్ ను నార్కోటిక్ పోలీసులు ఇదివరకే అరెస్ట్ చేశారు. ఆ రాంచంద్ నుంచి సేకరించిన సమాచారం ప్రకారం.. నవదీప్ ను కన్స్యూమర్ గా ప్రాథమికంగా పోలీసులు తేల్చారు. దాంతో మాదాపూర్ డ్రగ్స్ కేసులో నవదీప్ పేరు చేర్చి దర్యాప్తు వేగవంతం చేసిన పోలీసులు ఆయనకు నోటీసులు జారీ చేయాలని నిర్ణయించారు. మాదాపూర్ డ్రగ్స్ కేసు రిమాండ్ రిపోర్టులో నవదీప్ పేరు (ఏ29)ను చేర్చినట్లు సమాచారం. నటుడు నవదీప్ పరారీలో ఉన్నారని గురువారం పలు మీడియాలలో కథనాలు రాగా, తాను ఎక్కడికి పారిపోలేదని, ఈ కేసులో ఇరుక్కున్న నవదీప్ తాను కాదని స్పష్టం చేశారు. కానీ శుక్రవారం నాడు పరిస్థితి మారిపోయింది. నిందితులు తరచుగా హైదరాబాద్‌లో డ్రగ్స్ పార్టీలు నిర్వహిస్తున్నారని రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొన్నారు.ఇప్పటికే ముగ్గురు నైజీరియన్ లతో సహా 8 మంది నిందితులను పోలీసులు రిమాండ్ కు తరలించారు. దర్యాప్తు వేగవంతం చేసిన పోలీసులు నటుడు నవదీప్ పరారీలో ఉన్నాడని తెలిపారు. నోటీసులు ఇవ్వడానికి యత్నించగా అతడుగానీ, అతడి కుటుంబంగానీ అందుబాటులో లేదని, ఫోన్లు సైతం స్విచ్ఛాఫ్ వచ్చాయని పోలీసులు చెబుతున్నారు. ఇదే కేసులో మాజీ ఎంపీ కుమారుడు దేవరకొండ సురేష్‌ను అరెస్ట్ చేశామని తెలిపారు.డ్రగ్స్ కేసుతో హీరో నవదీప్ నకు సంబంధం ఉందన్న వార్తలపై తన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. పోలీసులు చెప్పిన తాను కాదని పేర్కొన్నారు. 'తాను ఎక్కడికి పారిపోలేదని, పరారీలో లేనని.. ఇక్కడే ఉన్నాను. దయచేసి క్లారిటీ తెచ్చుకోండి, థాంక్స్' అంటూ తన సోషల్ మీడియా అకౌంట్లో నవదీప్ పోస్ట్ చేశారు. పోలీసులు హీరో నవదీప్ అని ఎక్కడా పేర్కొనలేదని, అది తాను కాదని ఓ మీడియాతో మాట్లాడుతూ స్పష్టం చేశారు. కానీ పోలీసులు మాత్రం మాదాపూర్ డ్రగ్స్ కేసు రిమాండ్ రిపోర్టులో హీరో నవదీప్ పేరును చేర్చారు.

## నేడే విశ్వకర్మ జయంతి ఉత్సవాలు

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

ఈ నెల 17వ తేదీన విరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తగా 33 జిల్లాల్లో నిర్వహిస్తున్నట్లు బీ.సీ.సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రావెంకటేశం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వకర్మ జయంతి ఉత్సవ పండుగను అన్ని జిల్లాల్లో ఘనంగా జరుపుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు నిర్ణయించారని చెప్పారు. అన్ని జిల్లా కలెక్టరు కార్యాలయాల్లో, జిల్లా బీ.సీ. సంక్షేమాధికారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

## సంపాదకీయం

# సీట్ల లొల్లి మామూలుగా లేదుగా

జట్టు కట్టినా, పొత్తు పెట్టినా ఓ పార్టీల మధ్యనైనా సీట్ల పంపకం అనేది పెద్ద పంచాయితీ. కూటమిలోని పార్టీలు సమ ఉజ్జీలుగా ఉంటే సీట్ల పంపకం, అభ్యర్థుల ఎంపిక మరింత సవాలుగా ఉంటుంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఎలాగైనా గద్దె దించాలని ఇండియా పేరుతో జట్టు కట్టిన 28 పార్టీల మధ్య సీట్ల పంపకం అనేది ఏమంత సులభంగా అయ్యేలా లేదు. ఈ కూటమిలో కొన్ని పార్టీల మధ్య, మరీ ముఖ్యంగా కొన్ని రాష్ట్రాల్లో సీట్ల పంపకం చాలా కఠినంగా ఉండనుంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 28 పార్టీల కూటమి సీట్ల పంపకాన్ని ఫైనల్ చేసేందుకు చేరువైనట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నెలాఖరులోగా తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అయితే కొన్ని రాష్ట్రాల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల పంపకంలో పెద్దగా ఇబ్బందులు ఎదురుకాకపోవచ్చు. మహారాష్ట్రలో కాంగ్రెస్, ఎన్సీపీ, శివసేన ఇప్పటికే మిత్రపక్షాలుగా ఉన్నాయి. బిహార్, జమ్మూ కశ్మీర్ లో కూడా ఇలాంటి పరిస్థితే ఉంది కాబట్టి పెద్దగా ఇబ్బందులు రాకపోవచ్చు. కానీ కొన్ని రాష్ట్రాల్లో సీట్ల పంపకం మాత్రం సవాలుగా మారనుంది. బెంగాల్ లో అధికార తృణమూల్, కాంగ్రెస్, సీపీఐ మధ్య ఎలాంటి పొత్తు లేదు. తాజాగా ఇండియా కూటమిలో ఈ మూడు పార్టీలు పొత్తు పెట్టుకున్నాయి. ఇలాంటి పరిస్థితిలో ఈ మూడు పార్టీల మధ్య సీట్ల పంపకంలో కొత్త ఇబ్బంది తప్పదని రాజకీయ నిపుణులు అంటున్నారు. లోకసభ ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాలనేది ఈ సీట్ల పంపకాల ఉమ్మడి లక్ష్యం. ఎటువంటి భేషాజాలకు పోకుండా ఐకమత్యంగా ఉండి ముందుకు వెళ్తేనే బీజేపీని ఢీకొట్టగలమని భావిస్తున్న కూటమి నేతలు ఈ సారి బలమైన అభ్యర్థులనే పోటీలో నిలబెట్టాలని నిర్ణయించుకున్నారు. ప్రతిపక్ష ఇండియా కూటమి సమన్వయ కమిటీ మొదటి సమావేశం నిన్న జరిగింది. పార్టీల మధ్య సీట్ల పంపకం, రాబోయే ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. ముంబయి వేదికగా ఇండియా కూటమి మూడోసారి సమావేశమైనప్పుడు ఈ కమిటీని ఏర్పాటు చేశారు. ఎటువంటి భేషాజాలకు పోకుండా ఐకమత్యంగా ఉండి ముందుకు వెళ్తేనే బీజేపీని ఢీకొట్టగలమని భావిస్తున్న కూటమి నేతలు ఈ సారి బలమైన అభ్యర్థులనే పోటీలో నిలబెట్టాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు జరిగిన మొదటి సమన్వయ కమిటీ సమావేశంలో సీట్ల షేరింగ్ మీదే ప్రధానంగా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.పార్టీలకతీతంగా బలమైన అభ్యర్థులను ఎంపిక చేసి పోటీకి నిలబెట్టడానికి ఈ సమావేశం జరిగింది.14 మంది సభ్యులతో కూడిన సమన్వయ కమిటీ తీసుకునే నిర్ణయమే ఫైనల్ కానుంది. కూటమిలో ఏ నిర్ణయం అయినా ఈ కమిటీనే తీసుకుంటుంది. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేసి ప్రభుత్వాన్ని రద్దు చేసి ముందస్తుకు వెళ్తారన్న వార్తల నేపథ్యంలో వీలైనంత తొందరగా అభ్యర్థుల జాబితాను సిద్ధం చేయాలని ఇండియా కూటమి భావిస్తోంది. ఇప్పటికే మహారాష్ట్ర, బీహార్, తమిళనాడు రాష్ట్రాల్లో అభ్యర్థుల కేటాయింపు దాదాపు పూర్తయినట్లు తెలుస్తోంది. అయితే ఢిల్లీ, పంజాబ్, వెస్ట్ బెంగాల్ సహా ఇతర రాష్ట్రాల్లోని సీట్ల పంపకమే సమన్వయ కూటమికి సవాలుగా మారనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.జీ20 సదస్సు సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏర్పాటు చేసిన విందుకు పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గేకు ఆహ్వానం అందకపోవడంపై కూటమి నేతలేవరూ స్పందించలేదు. మరోవైపు కీలక పార్టీల అధినేతలు మమతా బెనర్జీ, నితీశ్‌కుమార్ విందుకు హాజరవడంపై విమర్శలు వచ్చాయి. దీనిపై కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌధురి బాహాటంగానే స్పందించారు. జేడీయూ నేత లాలూ ప్రసాద్ యాదవ్ కూడా దీన్ని తప్పుబట్టారు. కాగా, నితీశ్‌కుమార్ బీజేపీతో మళ్లీ జత కట్టినా ఆశ్చర్యపోనవసరం లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. విందుకు ఆయన హాజరైన తర్వాత బీహార్‌కు రావాల్సిన పెండింగ్ నిధులు విడుదల అయ్యాయి. దీంతో ఆయన వైఖరిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.జమిలి ఎన్నికలపై ఇండియా కూటమికి స్పష్టమైన వైఖరి లేదు. ఇది తమ వైఖరి అని కూటమి స్పష్టంగా చెప్పలేకపోయింది. జమిలి ఎన్నికలకు తాము వ్యతిరేకమని కాంగ్రెస్ చెప్పి న తర్వాత కూడా సమాజ్‌వాదీ పార్టీ జమిలి ఎన్నికలను సమర్థించడం చర్చనీయాంశమైంది. ఇండియా పేరును భారత్‌గా మార్చవద్దని కూటమి పక్షాలు పేర్కొనగా.. ఇండియా పక్కన భారత్ చేర్చితే సరిపోతుందని మమత సానుకూలంగా స్పందించారు. కూటమిలో ఏకాభిప్రాయం లేకుండా.. కూటమిని ప్రజలు ఏలా ఆదరిస్తారని పలువురు విమర్శిస్తున్నారు.సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు కూటమిని తీవ్ర ఇరకాటంలో పడేసింది. స్టాలిన్ వ్యాఖ్యలు కూటమి అభిప్రాయమని పేర్కొంటూ బీజేపీ ఎదురుదాడికి దిగింది. డీఎంకే పార్టీ విపక్ష కూటమిలో కీలకం కావడంతో మిగతా పార్టీలు దీనిపై ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. ఈ వ్యాఖ్యలను తప్పుపట్టలేని.. మరోవైపు సమర్థించలేని పరిస్థితి ఏర్పడింది. ఉదయనిధి వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు కార్తి చిదంబరం, ప్రియాంక ఖర్గే సమర్థించగా, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మాత్రం ఆచితూచి స్పందించారు. అయితే మధ్యప్రదేశ్‌లో త్వరలో ఎన్నికలు ఉండటంతో కాంగ్రెస్ నేత, మాజీ ముఖ్యమంత్రి కమలానాథ్ ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

### రంగారెడ్డి జిల్లా టీచర్ల

# పదోన్నతులపై హైకోర్టు స్టే

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రంగారెడ్డి జిల్లా టీచర్ల పదోన్నతులపై ఈనెల 19 వరకు హైకోర్టు స్టే విధించింది. రంగారెడ్డి జిల్లా స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీల పదోన్నతులపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లాలో సీనియారిటీ జాబితాపై ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్ల పిటిషన్లుపై కోర్టు శనివారం విచారించింది. జీవో 317 ద్వారా ఇతర జిల్లాల టీచర్లను రంగారెడ్డి జిల్లా కేటాయించారని పిటిషనర్ల వాదన. రంగారెడ్డి జిల్లా క్యాడర్ కన్నా ఎక్కువ టీచర్లను కేటాయించారని పిటిషనర్లు అభ్యంతరం లేవదీసారు. ప్రాథమిక సీనియార్టీ జాబితాపై అభ్యంతరాలకు తగిన సమయం ఇవ్వకుండా పదోన్నతులకు సిద్ధమయ్యారని పిటిషనర్లు పేర్కొన్నారు. అభ్యంతరాలను పరిశీలించిన తర్వాతే తుది సీనియారిటీ జాబితా రూపొందిస్తామని ప్రభుత్వం విన్నవించింది. తుది సీనియారిటీ జాబితా ఇవ్వకుండా పదోన్నతులు ఇవ్వబోమని ప్రభుత్వ న్యాయవాది తెలియచేసారు. పూర్తి వివరాలు సమర్పించేందుకు ఈనెల 19 వరకు సమయం కోరారు. విద్యాశాఖ కార్యదర్శి, డీఎస్ఈ, రంగారెడ్డి డీఈవోకు హైకోర్టు నోటీసులు, విచారణ ఈనెల 19కి వాయిదా వేసింది. ప్రాథమిక సీనియార్టీ జాబితా ఆధారంగా పదోన్నతులు ఇవ్వొద్దని హైకోర్టు ఆదేశించింది.

# 40 దశాబ్దాల కల నెరవేరింది

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి హరీష్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు.అవాంతరాలు, అడ్డంగులను అధిగనిస్తూ.. కుట్రలను ఛేదిస్తూ.. కృష్ణమ్మ జలాలను తీసుకొచ్చి పాలమూరు ప్రజల పాదాలు కడుగుతామని ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం కేసీఆర్ కృతజ్ఞతలని తెలిపారు. పాలమూరు ప్రజల దశాబ్దాల కల, తరతరాల ఎదురుచూపులు నెరవేరే సమయం ఆసన్నమైనట్లు పేర్కొన్నారు. నెర్రెలు బారినటువంటి పాలమూరు నేలను తడపడానికి కృష్ణమ్మ రానుందని అన్నారు.

నాడు పాలకులు మారినా కూడా పాలమూరు ప్రజల బతుకులు మారలేవని అన్నారు. తాగు, సాగునీటికి తిప్పలు తప్పలేవన్నారు. కానీ పదేళ్ల స్వరాష్ట్రంలో.. సీఎం కేసీఆర్ పాలనలో పాలమూరు దశ దిశ మారిందని పేర్కొన్నారు. నదులు, చెరువులు, వాగులు ఎండిన చేలా దాహాన్ని తీరుస్తున్నాయని.. పచ్చదనాన్ని పరుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోత పథకం ద్వారా 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం చాలా గొప్ప విషయమని అన్నారు.ఇది తెలంగాణ సాధించనటువంటి శతాబ్ధపు విజయని అన్నారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ (ట్విట్టర్)లో పోస్టు చేశారు. మరోవైపు మంత్రి కేటీఆర్ కూడా ఈ పథకం ప్రారంభోత్సవంపై స్పందించారు. తరతరాల ఎదురు చూపులు ఫలించిన వేళ.. పల్లేర్లు మొలచిన పాలమూరులో పాలనురగల జలహేల అంటూ ట్విట్టర్‌లో రాసుకొచ్చారు. ఇదిలా ఉండగా.. మరోవైపు రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం మొదలైంది. ఈ ఏడాది డిసెంబర్‌లో ఎన్నికలు జరగనున్నట్లు ప్రచారంలో ఉండేది. అయితే ఈసారి జమిలి ఎన్నికలు నిర్వహిస్తారనే ఊహగాణాలు వస్తున్నాయి. మరోవైపు ఇటీవల మంత్రి కేటీఆర్ కూడా అసెంబ్లీ ఎన్నికలు ఆలస్యం అయ్యే అవకాశం ఉండొచ్చని చెప్పడి ఈ ఊహగాణాలను మరింత పెంచేసింది. అయితే సెప్టెంబర్ 18 నుంచి 22 వరకు జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో దీనిపై ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉంది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ పార్టీలపై విమర్శలు గుప్పించారు. ఈ రోజు అమిత్ షా వచ్చి తిడుతారు.. రేపు ఖర్గే వచ్చి తిడుతారు అంటూ మంత్రి అన్నారు. వాళ్ళది తిట్లలో పోటీ.. మనది కిట్లలో పోటీ అని హరీశ్ రావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీది బట్ట కాల్చే మీద వేసే సంస్కృతి.. ప్రతిపక్షాల పాలనకు మా పాలనకు నక్కకు నాగ లోకానికి ఉన్నంత తేడా ఉంది అని వైద్యారోగ్యమంత్రి అన్నారు.కాంగ్రెస్ పార్టీది తన్నుల సంస్కృతి.. పార్టీది టన్నుల పంట పండించే సంస్కృతి అంటూ మంత్రి హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భారతదేశానికి దిక్సుచిగా మారింది.. దేశంలో 3 శాతం జనాభా ఉన్న మన తెలంగాణ ఎన్నో అవార్డులు సాధించింది.. ధాన్యం ఉత్పత్తిలో హర్యానా, పంజాబ్ రాష్ట్రాలను దాటి కేరాఫ్ అడ్రస్ గా తెలంగాణ మారింది అని ఆయన పేర్కొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేసింది.. పాలమూరు ప్రాజెక్టు దక్షిణ తెలంగాణను సస్యశ్యామలం చేస్తుంది.. దేశ వైద్య అవసరాలు తీర్చేందుకు డాక్టర్లును తయారు చేస్తున్నామని మంత్రి హరీశ్ రావు అన్నారు.అదే విధంగా సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై మంత్రి హరీష్ రావు విమర్శలు గుప్పించాడు. ఎమ్మెల్యే జగ్గారెడ్డి గెలిచినప్పటి నుంచి అందుబాటులో లేడు.. ఆ ఎమ్మెల్యే అడ్రస్ లేదు.. ఎక్కడున్నాడో తెలియదు.. నియోజకవర్గ ప్రజలకు ఫోన్ నెంబర్ తెలియని ఎమ్మెల్యే జగ్గారెడ్డి.. కాంగ్రెస్ వాళ్లు గొప్పలు చెప్పి చెవిలో పువ్వులు పెడుతున్నారు అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో కాంగ్రెస్ చేసేందేమి లేదు.. కాంగ్రెస్ వి వట్టి మాటలే.. కేసీఆర్ సర్కార్ చేతల ప్రభుత్వం.. కేసీఆర్ పక్క హిందూ.. కానీ కుల మతాలకు అతీతంగా పని చేసాడు.. సీఎం కేసీఆర్ అద్భుతాలు సృష్టిస్తున్నారు.. కాంగ్రెస్ వాళ్లు అబద్ధాలు చెబుతున్నారు అని హరీశ్ రావు విమర్శించారు.

# అమెరికా అబర్న్ యూనివర్సిటీతో తెలంగాణ ఫారెస్ట్ కాలేజీ ఒప్పందం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

అమెరికా అలబామా రాష్ట్రంలో ఉన్న ప్రముఖ యూనివర్సిటీ అబర్న్ లో ఫారెస్ట్రీలో ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం తెలంగాణ విద్యార్థులకు దక్కనుంది. ఫారెస్ట్ కాలేజీ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఈఅఫీఎ) లో బీఎస్సీ ఫారెస్ట్రీ చదివిన విద్యార్థుల్లో ప్రతీ యేటా ఇద్దరికి ఎమ్మెస్సీ ఫారెస్ట్రీ కోసం పూర్తి ఫండింగ్ ఇచ్చేందుకు అబర్న్ యాజమాన్యం అంగీకరించింది. ఈ మేరకు అమెరికా యూనివర్సిటీ ప్రాంగణంలో ఒప్పందం (ఓనీఐ) కుదిరింది. అబర్న్ యూనివర్సిటీ ఫారెస్ట్రీ కాలేజీ డీన్ డాక్టర్ జానకి అలవలపాటి, తెలంగాణ ఫారెస్ట్ కాలేజీ డీన్ ప్రియాంక వర్గీస్ లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. సంవత్సరానికి ఇద్దరు చొప్పున ప్రతిభా వంతులైన విద్యార్థులకు ఫారెస్ట్రీలో ఎమ్మెస్ చదివేందుకు కుదుర్చుకున్న ఒప్పందం ఆరేళ్ల పాటు అమల్లో ఉంటుందని వారు తెలిపారు. అబర్న్ యూనివర్సిటీ ప్రతినిధులు విన్నీ నాథన్, డాక్టర్ క్రిస్టోఫర్ రాబర్ట్స్, బ్రెట్ వైట్, ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు చొరవతో ప్రారంభించిన అటవీ కలాశాలకు నేడు అంతర్జాతీయ గుర్తింపుతో పాటు, మంచి ఉద్యోగాల కల్పనకు ఈ ఒప్పందం దోహద పడుతుందని ప్రియాంక వర్గీస్ తెలిపారు.

# ఎన్నికలు సంగతేంటీ..!

(మొదటి పేజీ తరువాయి)

ఆలస్యమవుతుందనేది వట్టి ప్రచారం మాత్రమేనని అంటున్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఈ నెల 18 నుంచి నిర్వహించనున్న పార్లమెంట్ స్పెషల్ సెషన్స్‌లో ఏయే బిల్లులుంటాయనే సస్పెన్స్ కొనసాగుతున్నది. దీంతో ఈ సమావేశాలు పూర్తయితే కానీ రాష్ట్ర ఎన్నికలపై క్లారిటీ వచ్చే అవకాశం లేదని ప్రధాన పార్టీలు భావిస్తున్నాయి. అందుకే అభ్యర్థుల ప్రకటన విషయంలో కాంగ్రెస్?, బీజేపీ వేచి చూసే ధోరణిలో ఉన్నాయి. వాస్తవానికి తెలంగాణతోపాటు చత్తీస్?గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మిజోరాం రాష్ట్రాల్లో డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. మిగతా నాలుగు రాష్ట్రాలకు ఎన్నికలు పెట్టేసి.. ఒక్క తెలంగాణ ఎన్నికలను మాత్రమే వాయిదా వేస్తారని లీడర్లు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.2018లో డిసెంబర్ 7న పోలింగ్ జరగ్గా.. టీఆర్ఎస్ (బీఆర్ఎస్) గెలవడంతో కేసీఆర్ నేతృత్వంలో రెండోసారి ప్రభుత్వం కొలువుదీరింది. ఈసారి అసెంబ్లీకి డిసెంబర్‌లోనే ఎన్నికలు ఉండొచ్చనే అంచనాతో బీఆర్ఎస్? ఆగస్టు 21వ తేదీన 115 మంది అభ్యర్థులతో జాబితా ప్రకటించింది. కేవలం నాలుగు సీట్లను మాత్రమే పెండింగ్‌లో పెట్టింది. అభ్యర్థులను ప్రకటించిన రోజు నుంచే గులాబీ లీడర్లు ప్రచారం మొదలు పెట్టారు. అసంతృప్తులను బుజ్జగించడం, లోకల్ లీడర్లను అట్టిపెట్టుకోవడం, ఇతరత్రా వ్యవహారాలతో వారికి ఖర్చు తడిసి మోపెడవుతున్నది. ఈ క్రమంలో డిసెంబర్‌లో ఎన్నికలు ఉండకపోవచ్చనే అంచనాతో గులాబీ పార్టీ ఒక్కసారిగా వెనక్కి తగ్గింది. ఒకవేళ పార్లమెంట్‌తో పాటే అసెంబ్లీ ఎన్నికలు జరిగితే అప్పటి వరకు భారీ మొత్తం ఖర్చు పెట్టాల్సి రావడం, కేటీఆర్ ఇటీవల మీడియా చిట్ చాట్‌లో ఎన్నికలపై చేసిన కామెంట్లతో సిట్టింగ్‌లందరూ గందరగోళానికి గురయ్యారు. ఇతర పార్టీలు కూడా డైలమాలో పడ్డాయి. ఇతర పార్టీలను గందరగోళ పరిచేందుకే కేటీఆర్ ఇలాంటి కామెంట్స్ చేశారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కొట్టిపారేశారు. కానీ పార్లమెంట్ సెషన్‌లో జమిలిపై ఏదో ఒక నిర్ణయం ఉంటుందనే చర్చలు ఢిల్లీ సర్కిల్స్‌లో బలంగా వినిపిస్తున్నాయి. అందుకే బీఆర్ఎస్ వెయిట్ అండ్ సీ అన్న ధోరణి అనుసరిస్తున్నది. పార్లమెంట్ సమావేశాలు ముగిసే వరకు ప్రచారం వద్దంటూ ఎమ్మెల్యేలను కేసీఆర్ అలర్ట్ చేశారు.ఎన్నికలు లేట్ అవుతాయనే ప్రచారం బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికపై పడింది. ఇప్పటికే ఆ రెండు పార్టీలు ఎమ్మెల్యే ఆశావాహుల నుంచి అప్లికేషన్లు స్వీకరించాయి. కాంగ్రెస్‌కు 1,025 మంది, బీజేపీకి 6,003 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని వడపోసి హైకమాండ్?కు పంపించి.. లిస్ట్ రిలీజ్ చేయటమే తరువాయి. ఈ నెలలోనే అభ్యర్థులను ప్రకటించాలని భావించిన కాంగ్రెస్.. తాజా పరిణామాలతో వెనక్కి తగ్గింది. హైదరాబాద్‌లో సీడబ్ల్యూసీ సమావేశాలు, తుక్కుగూడలో విజయభేరి సభ ఏర్పాట్లపైనే ఫోకస్ పెట్టింది. బీజేపీది కూడా ఇదే పరిస్థితి. ప్రస్తుతానికి అప్లికేషన్ల వడపోతను ఆపేసింది. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాల నిర్వహణపై దృష్టి పెట్టింది. దీంతో బీఆర్ఎస్ కూడా వరుసగా రెండో ఏడాది ప్రభుత్వం అధ్వర్యంలో సమైక్యతా వేడుకలకు ఏర్పాట్లు చేసుకుంది. ఈలోగా పార్లమెంట్ స్పెషల్ సెషన్‌లో ఏం జరుగుతుందనేది తేలిపోతుందని మూడు పార్టీలు భావిస్తున్నాయి.రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పెద్ద ఎత్తున బోగస్ ఓట్లు ఉండటాన్ని ఈసీ గుర్తించింది. దాదాపు 15 లక్షల వరకు బోగస్ ఓట్లు ఉన్నాయని రాజకీయ పార్టీలు ఈసీకి ఫిర్యాదులు చేశాయి. ఒక్కో ఇంటి నంబర్‌పై వందల ఓట్లు ఉన్నట్టుగా ఫీల్డ్ సర్వేలో నిర్ధారణ అయింది. హైదరాబాద్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో ఈ సంఖ్య పెద్ద ఎత్తున ఉందనే ఆరోపణలున్నాయి. దీంతో ఈసీ కూడా వీటిపై దృష్టి సారించింది. ఒకవేళ బోగస్ ఓట్ల ఏరివేతకు ఈసీ ఆదేశిస్తే.. రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు ఆలస్యం కావొచ్చనే అనుమానాలు నెలకొన్నాయి.

# బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య ఫ్లెక్సీ వార్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య ఎన్నికల వార్ నడుస్తోంది. హైదరాబాద్‌లో ఇవాళ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం ఉంది. అలాగే రేపు తుక్కుగూడలో భారీ బహిరంగసభ నిర్వహిం చబోతోంది కాంగ్రెస్ పార్టీ. ఆ సభకు హాజరవుతున్న కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ... ఆరు గ్యారంటీల పేరుతో ఎన్నికల హామీలు కూడా ప్రకటిస్తారని చెప్పారు. మరోవైపు సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని.. పెరేడ్‌గ్రౌండ్‌లో బీజేపీ సభ నిర్వహిస్తోంది. ఈ సభకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వస్తున్నారు. ఈక్రమంలో కాంగ్రెస్, బీజేపీలను ప్రశ్నిస్తూ నగరంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు ప్రత్యర్థులు. కాంగ్రెస్,బీజేపీలు తెలంగాణ రాష్ట్రానికి ఏం చేశాయని ప్రశ్నిస్తూ.. కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలను ఫ్లెక్సీల్లో పెట్టారు. సీడబ్ల్యూసీ సమావేశాలకు వంద మంది వరకు కాంగ్రెస్ సీనియర్ నేతలు.. కాంగ్రెస్ పాలిత రాష్ట్ర సీఎంలు హాజరవుతున్న వేళ... వారిని ఆహ్వానిస్తూ బేనర్లు కనిపిస్తున్నాయి. మరోవైపు వారికి వ్యతిరేకంగా కొన్ని ప్రాంతాల్లో పోస్టర్లు వెలిశాయి. అది కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కాదు.. కరప్ట్ వర్కింగ్ కమిటీ అంటూ ఫ్లెక్సీల ద్వారా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుల ఫొటోలు, వారు చేసిన స్కాముల వివరాలతో పోస్టర్లు వేశారు. హోర్డింగ్స్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా మొత్తం 24 మంది కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుల ఫొటోలు, వారి స్కాముల వివరాలు అందులో ఉంచారు. బివేర్ ఆఫ్ స్కామర్స్ అంటూ టాగ్ లైన్ కూడా పెట్టారు. సీఎం కేసీఆర్ తెలంగాణలో వృద్ధాప్య పింఛన్ 2వేల 16 రూపాయలు ఇస్తుంటే... కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో ఇస్తున్న పింఛన్లు ఎంత? అంటూ క్వశ్చన్ చేశారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇస్తామన్న రాహుల్, సోనియా గాంధీ ఎందుకు మాట నిలబెట్టుకోలేదో చెప్పాలన్నారు. కాంగ్రెస్ హయాంలో వరంగల్ నుండి ఐటీ మంత్రిగా ఉండి కూడా వరంగల్‌కు ఒక్క ఐటీ కంపెనీ కూడా ఎందుకు తీసుకురాలేదు అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి... వ్యవసాయానికి మూడు గంటల ఉచిత విద్యుత్ చాలు అని మాట్లాడారని... సోనియా, రాహుల్ ఒప్పుకుంటున్నారా అని క్వశ్చన్ చేశారు. 2004 నుండి 2014 వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్.. ఎస్సీ వర్గీకరణ ఎందుకు చేయలేదన్నారు. ఎస్సీ డిక్లరేషన్ పేరుతో అలానే చేస్తారా అంటూ ఎద్దేవా చేశారు. బీజేపీపై కూడా పోస్టర్లు వెలిశాయి. గోవా లిబరేషన్ డేకు 300 కోట్ల రూపాయలు ఇచ్చిన కేంద్రంలోని మోడీ సర్కార్.. తెలంగాణ ఇంటిగ్రేషన్ డేకు ఒక్క రూపాయి కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. తెలంగాణకు వస్తున్న అమిత్‌షా ఏమైనా ప్రకటిస్తా అంటూ నిలదీశారు.

## మట్టితో తయారుచేసిన గణేష్ ప్రతిమలను
# పంపిణీ చేసిన కరుణామయ విద్యార్థులు

**- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వద్దు మట్టితో తయారుచేసిన విగ్రహాలు ముద్దు**




**కౌతాళం - ప్రభాత సూర్యుడు :** కరుణామయ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లోని విద్యార్థులు మట్టి గణేష్ ప్రతిమలను తయారుచేయడం జరిగిందని కరస్పాండెంట్ దండే వెంకట నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ దండే వెంకట్ నరేష్ మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు ఎంతో శ్రద్ధతో మట్టి గణనాథుని ప్రతిమలను తయారు చేసి తీసుకురావడం శుభపరిణామమని, మట్టితో తయారుచేసిన గణనాథుని ప్రతిమలను ప్రతిష్టించడం వలన పర్యావరణానికి హాని కలగకుండా ఉంటుందని తెలిపారు. పాఠశాల వ్యవస్థాపకులు దండే దస్తగిరి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యార్థులు స్వయంగా మట్టితో తయారుచేసిన గణేష్ ప్రతిమలు తెస్తున్నారని, మట్టితో తయారుచేసిన గణేష్ విగ్రహాలను ప్రతిష్టించాలని విద్యార్థులు సందేశం అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రాజేంద్ర నగర్ పీవీఎన్ఆర్
# ఎక్స్‌ప్రెస్ వే పై రోడ్డు ప్రమాదం

**- కారు.. వెనుక కారు..!**
**- ఒకదాని వెనుక మరోటి వరసగా 4 కార్లు ఢీ**
**- పీవీఎన్ఆర్ పిల్లర్ నెంబర్ 139 ఎక్స్‌ప్రెస్ వే పై ప్రమాదం**
**- కిలోమీటర్ మేర స్తంభించిన ట్రాఫిక్**

**రంగారెడ్డి - ప్రభాత సూర్యుడు :** పీవీఎన్ఆర్ ఎక్స్ప్రెస్ వే పై వరుసగా నాలుగు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కార్లు ధ్వంసమవగా ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి తెల్లవారుజామున పిల్లర్ నెంబర్ 139 వద్ద చోటు చేసుకుంది. తెల్లవారుజామున శంషాబాద్ నుంచి మెహిదీపట్నం వైపు వస్తుండగా ఓ వ్యాన్ వివిఎన్ఆర్ ఎక్స్ప్రెస్వే పై పిల్లర్ నంబర్ 139 వద్ద అస్మాత్తుగా ఆగింది. వెనకాల వస్తున్న కారు దానిని తప్పించె క్రమంలో డివైడర్ను ఢీకొంది. దాని వెనకాల వచ్చిన మరో మూడు కార్లు వరుసగా దానికి ఒకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వాహనాలు ధ్వంసం అవగా ఇద్దరికీ గాయాలయ్యాయి. కార్లు ఒకదానికొకటి వర్షాగా ఢీకొనడంతో సుమారు కిలోమీటర్ మేర వాహనాలు స్తంభించాయి. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. వాహనాలను నియంత్రించారు. ధ్వంసమైన కారులను అక్కడి నుంచి తరలించారు.

# 21న రెండో విడత ఇళ్ల పంపిణీ

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

హైదరాబాద్‌లో రెండో విడత డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ ముహూర్తం ఖరారైంది. ఈ నెల 21న రెండో విడతలో భాగంగా 13 వేల 3 వందల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ తెలిపారు. పేద ప్రజలు ఆత్మగౌరవంతో జీవించాలనే ఉద్దేశంతోనే వారికి డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రభుత్వం నిర్మించి ఉచితంగా అందజేస్తుందని మంత్రి తలసాని ఈ సందర్భంగా అన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో రెండో విడతగా 11,700 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లుగా మంత్రి తెలిపారు. రెండో విడత ప్రక్రియలో దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించామన్నారు. దివ్యాంగులకు 470, ఎస్సీలకు 1,923, ఎస్టీలకు ఎస్టీలకు 655 కేటాయించగా.. ఇతరులకు 8,652 కేటాయించినట్లు వివరించారు. కేటాయింపులో ఎలాంటి ఎవరి జోక్యం లేకుండా పారదర్శకంగా నిర్వహించడం జరిగిందని అన్నారు. ఇళ్లు రాని వారు ఏలాంటి భయాందోళనలు పడొద్దని, ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని మంత్రి అన్నారు. పేద, మధ్య తరగతి వారు ఎంతో గొప్పగా బ్రతకాలని ఉద్దేశంతో ఖరీదైన ప్రాంతాలలో ఇల్లు కట్టించి ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. దేశంలో ఎక్కడా కూడా ఇలాంటి ఇండ్లను కట్టి ఇచ్చిన దాఖలాలు లేవని.. ఢిల్లీలోని ఐఏఎస్, ఐపీఎస్‌ల క్వార్టర్స్‌కు ఏ మాత్రం తీసిపోకుండా ఇక్కడి డబుల్ బెడ్ రూమ్‌లు ఉన్నాయని మాజీ గవర్నర్ నరసింహన్ చెప్పారన్నారు. ఈ నెల 21వ తేదీన 2బీహెచ్‌కే పంపిణీ ఉంటుందని తెలిపారుకాగా, లబ్ధిదారుల అడ్రస్ మారితే వారు ఇది వరకు ఇచ్చిన అడ్రస్ కు సమాచారం ఇస్తామని ఆయన తెలిపారు

## బద్వేల్ లో వినాయక చవితి
# వేడుకలకు సిద్ధమైన మండపాలు

**- కంటే ఈసారి ఘనంగా స్వామివారి ఉత్సవాలు**
**- బద్వేల్ పట్టణంలోనే పలు మండపాలు**
**- పోటా పోటీగా నిర్వాహకులు**

**బద్వేలు - ప్రభాత సూర్యుడు :** సోమవారం జరిగే వినాయక చవితి వేడుకలకు బద్వేల్ లో మండపాలు సిద్ధమవుతున్నాయి పండుగనాటికి పూర్తి స్థాయిలో మండపాలు నిర్మిస్తారు ప్రతి వినాయక చవితి పండుగకు బద్వేలు పట్టణంలోనే పలు మండపాలు



వెలుస్తాయి ఈసారి కూడా అదే స్థాయిలో మండపాలు ఏర్పాటు చేస్తున్నారు ప్రతి వినాయక స్వామి మండపంలో భారీ విగ్రహాలు ఏర్పాటు చేస్తారు బద్వేలు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో వినాయక స్వామి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగబోతున్నాయి ఇందుకోసం నిర్వాహకులు వేలు లక్షరాల రూపాయలు ఖర్చు చేస్తున్నారు బద్వేల్ లో గత కొంతకాలంగా వినాయక స్వామి విగ్రహాలు తయారు చేస్తున్నారు దాదాపు అన్ని సిద్ధమయ్యాయి ఏడు మండలాల్లో ప్రతి గ్రామంలో వినాయక చవితి వేడుకలు ఎంతో ఘనంగా జరుపుతారు చాలా సంవత్సరాలుగా ఆనవాయితీ వస్తుంది ఇప్పుడు కూడా అదే పద్ధతిలో వినాయక స్వామి ఉత్సవాలు జరప బోతున్నారు.

# అత్యాధునిక హంగులతో టీఎస్ఆర్టీసీ నర్సింగ్ కళాశాల

**- అందుబాటులోకి వచ్చిన నూతన భవనం**
**- ప్రారంభించిన సంస్థ చైర్మన్, విసి అండ్ ఎం.డి**
**- నర్సుల సేవలు అమోఘమంటూ కితాబు**

**- హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**




అత్యాధునిక హంగులతో నిర్మించిన తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ) నర్సింగ్ కళాశాల నూతన భవనం విద్యార్థులకు అందుబాటులోకి వచ్చింది. రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో రూ.10 కోట్ల వ్యయంతో నాలుగు అంతస్థుల భవన సముదాయాన్ని సంస్థ నిర్మించింది. హైదరాబాద్ తార్నాక ఆస్పత్రి ప్రాంగణంలో శనివారం నర్సింగ్ కళాశాల నూతన భవనాన్ని సంస్థ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్, ఎండీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గారు ప్రారంభించారు. అనంతరం తరగతి గదులు, ల్యాబొరేటరీలను వారు పరిశీలించారు. నూతన భవనంలో విద్యార్థులకు కల్పిస్తోన్న సౌకర్యాలను అధికారులను అడిగి తెలుసు కున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తార్నాక టీఎస్ఆర్టీసీ ఆస్పత్రికి అను సంధానంగా 2021-22 విద్యా సంవత్సరం నుంచి నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేశామని తెలిపారు. నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన వారికి వైద్య రంగంలో మంచి భవిష్యత్ ఉందని, విద్యార్థులందరూ టీఎస్ఆర్టీసీ అందిస్తోన్న నర్సింగ్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆస్పత్రుల్లో నర్సులు కుటుంబసభ్యుల్లాగా రోగులను పరిగణించి.. అత్యుత్తమ సేవలను అందిస్తున్నారని గుర్తు చేసు కున్నారు. చికిత్స సమయంలో రోగులకు తల్లికంటే ఎక్కువగా సేవలు అందిస్తూ ఎందరో ప్రాణాలను నిలబెడుతున్న నర్సుల సేవలు ఎనలేనివని కొనియాడారు. తనతో పాటు ఎండీ పట్టుదల, వ్యూహాత్మక నిర్ణయాలతో సంస్థ పురోభివృద్ధి సాధ్యం అవుతోందని, తాను చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సమయం నాటికి ఇప్పటికి సంస్థలో గణనీయంగా నష్టాలు తగ్గుముఖం పట్టాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పెద్ద మనసుతో సంస్థ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ నిర్ణయం తీసుకున్నారని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వి.సి.సజ్జనర్, ఐ.పి.ఎస్ గారు మాట్లాడుతూ, "నర్సింగ్ కోర్సుకు మంచి డిమాండ్ ఉన్నది. కోర్సు పూర్తి చేసిన నర్సింగ్ విద్యార్థులకు విదేశాలలోనూ అవకాశాలు మెండుగా లభిస్తున్నాయి. అందుకే, కష్టపడి చదివి విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది" అని పేర్కొన్నారు. గత కొన్నేళ్ల క్రితం నర్సింగ్ కళాశాలను పెట్టాలని ఆలోచించిందనే విషయాన్ని గుర్తు చేస్తూ నేడు స్వల్ప వ్యవధి 12 నెలల కాలంలోనే నర్సింగ్ కళాశాల భవనం మెరుగైన సదుపాయాలతో పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిందన్నారు. ఇది గోల్డెన్ ఛాన్స్ అంటూ నర్సింగ్ విద్యార్థులు బాగా చదువుకుని అటు కుటుంబ సభ్యులకు, ఇటు సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. నర్సింగ్ కళాశాల భవనాన్ని రూ.10కోట్లతో నిర్మించడం జరిగిందని, ఈ కళాశాల 50 మంది విద్యార్థులతో 2021-22 విద్యా సంవత్సరంలో ప్రారంభమైన ఈ కళాశాలలో మేనేజ్‌మెంట్ కోటా 20 సీట్లలో ఆర్‌టిసి ఉద్యోగుల పిల్లలకు యూనివర్సిటీ విద్యార్థులతో సమానంగా ఐదు సీట్లు కేటాయించడం జరుగుతోందని తెలిపారు. నర్సింగ్ కోర్సులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు త్రిష, అమూల్యను ఘనంగా సన్మానించారు. త్రిషకు రూ.10 వేలు, అమూల్యకు రూ.7 వేల నగదు పురస్కారాలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) డాక్టర్ వి.రవీందర్, తార్నాక ఆసుపత్రి సలహాదారు, ఓఎస్డీ సైదిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఎ, ఎం, పి అండ్ ఎం) కృష్ణకాంత్, జాయింట్ డైరెక్టర్ (విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ) సంగ్రామ్ సింగ్ జి. పాటిల్, సీఈఈ రాంప్రసాద్, సీఎఫ్ఎం విజయపుష్ప, తార్నాక టీఎస్ఆర్టీసీ ఆస్పత్రి సూపరింటెండెంట్ శైలజా కృష్ణమూర్తి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వసుంధర తులసి, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట
# యోధులను మరిసిన సిఎం కెసిఆర్

**- అమరుల త్యాగాలు వృదా కావు**
**- అమరుల ఆశయాల సాధన కోసం ప్రజా పోరాటాల సిద్ధమైందాం**
**- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి**

**హుస్నాబాద్ - ప్రభాత సూర్యుడు :** ఆనాడు నిజాం నవాబుతో ప్రాణ త్యాగలకు తెగించి తెలంగాణ సాయుధ పోరాటం చేసిన అమరవీరుల పోరాట ఫలితంగా తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో అమల కుటుంబాలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మరిచి పోయారని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం నాడు హుస్నాబాద్ మండలం కేంద్రంలో ఉన్న తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అనభేరి ప్రభాకర్ రావు విగ్రహానికి పుల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ పేదల రాజ్యం స్థాపన కోసం ఆనాడు నిజాం నవాబుతో ఎదురొడ్డి నిలిచిన భారత కమ్యూనిస్టుపార్టీ సిపిఐ నేతలు బద్దం ఎల్లారెడ్డి,రావి నారాయణరెడ్డి, మగ్దూం మెయినినోద్దిన్, అనభేరి ప్రభాకర్ రావు,సింగిరెడ్డి భూపతి రెడ్డి,కళలు కన్న పేదల రాజ్యం ఇప్పటికి రాలేదని దోపిడి పాలకుల రాజ్యంలో ప్రజలు నలిగి పోతున్నారని పేదల రాజ్యం స్థాపన కోసం నేడు ప్రజలంతా ఒకటి కావాలని అప్పుడే ప్రజలకు న్యాయం జరుగుతుందనిచాడ వెంకటరెడ్డి అన్నారు.

హుస్నాబాద్ ప్రాంత అభివృద్ధికి సిపిఐ పోరాటల ఫలితంగానే పేదలకు ఇండ్ల స్థలాలు, పక్కఇండ్లు, ప్రభుత్వ వ్యవసాయ భూములు,అనేక చట్టాలు, గండిపెల్లి,గౌరవెల్లి, తొటపెల్లి ప్రాజెక్టులను సాధించినది సిపిఐఅని అనునిత్యం ప్రజల కోసం పనిచేసే ఎక్కైకైక పార్టీ సిపిఐ ఒక్కటేనని సిపిఐ కంటికిరెప్పలా కాపాడుకోవాలని చాడ వెంకటరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెల్పుల బాలమల్లు, యెడల వనేష్,జాగీర్ సత్యనారాయణ, నియోజకవర్గం నాయకులు బొయిని అశోక్,అందే స్వామి, కొయ్యడ సృజన్ కుమార్, ముద్ర కోలరాజయ్య, బత్తుల బాబు,చాడ శ్రీదర్ రెడ్డి, చిగురుమామిడి, అక్కన్నపెట, కొహెడ, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల కార్యదర్శులు నాగేల్లి లక్ష్మారెడ్డి, కొమ్ముల భాస్కర్, ముంజ గోపి,ఉట్కురి రాములు, సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల నాయకులు భారత జాతీయ మహిళా సమాఖ్య నాయకురాల్లు గూడెం లక్ష్మి,గూడ పద్మ,మంచాల రమాదేవి,పిల్లి రజినీ, నేలవేణి స్వప్న,దుద్దేడ శశిరేఖ, పొన్నాల స్వప్న, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుట్ల శంకర్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జెరిపోతుల జనార్దన్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజీవరెడ్డి, కొయ్యడ కొమురయ్య, ఏగ్గొజు సుదర్శన్ చారి, మంద శ్రీనివాస్, గ్రామ శాఖ కార్యదర్శి పిట్టల ప్రసాద్, సిపిఐ మండల నాయకులు పోదిల కుమారస్వామి, అయిలేని మల్లారెడ్డి, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## దుర్మార్గ పాలనకు తగిన బుద్ధి ప్రజలే చెబుతారు

**- తెదేపా సీనియర్ నాయకులు ఉలిగయ్య ముత్తిరెడ్డి**

**కౌతాళం - ప్రభాత సూర్యుడు :** దుర్మార్గపు పాలనకు రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అక్రమ అరెస్టుకు నిరాశిస్తూ నీ వెంట మేము నీకోసం మేము అంటూ నాలుగవ రోజు రిలే నిరాహార దీక్షలు తెదేపా




సీనియర్ నాయకులు ఉలిగాయ్య,ముత్తు రెడ్డి, రామిరెడ్డి, చేపట్టారు. శనివారం హాల్వి గ్రామంలో నిరాహార దీక్షలో వారు మాట్లాడుతూ..స్కిల్ డెవలప్మెంట్ కేసులో అక్రమంగా అరెస్టు చేసిన తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడి వెంటనే విడుదల చేయ్యలని ఆంధ్ర రాష్ట్రం మొత్తం అండగా ఉందని, మీరు ఎన్ని ఇబ్బందులు పెట్టిన జయించి మరల 2024 లో అధికారం చేపట్టి మీరు చేసిన అరచక, అక్రమ ,అన్యాయాలను తిప్పికొట్టాడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ప్రతి గ్రామానికి వెళ్ళి సామాన్య ప్రజలకు వివరిస్తాము అని తెలియజేశరు. మంత్రాలయం తెదేపా సీనియర్ నాయకులు ఉలిగయ్య ముత్తు రెడ్డి రామిరెడ్డి ఈ కార్యక్రమములో సీనియర్ నాయకులు సురేశ్ నాయుడు, సతీశ్ నాయుడు, లాక్కే గోవిందు, గోట్టయ్య, చిన్న సిద్ధప్ప, హాల్వి సిద్ధప్ప, రామలింగన్న, కురువ వీరేష్, నగేశ్, హనుమంతు, రామన్ గౌడ్, మల్లప్పగౌడ్, దర్గా మౌల, కిచిడి చన్నప్ప, సన్నప్ప, మూకన్న మరలి, మహాదేవ, తెలుగు యువత నర్సిరెడ్డి ముకాన్న, విజయ, రమంజీ ,రోహిత్ చూడి, సోము లింగేష్, మహీంద్రాగౌడ్, రమేష్ బారికి,ఖాదర్ బాషా, రాష్ఫుత్ర గుండా, నాగేంద్ర, మణి వడ్డే చన్నప్ప,వడ్డే రవి,మండలములోని గ్రామ నాయకులు, కార్యకర్తలు , తెలుగు యువత పెద్ద ఎత్తున పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

## నకిలీ విలేకరులు అరెస్ట్

**భద్రాచలం - ప్రభాత సూర్యుడు :** ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి విలేకరులమని చెప్పుకొని వసూళ్లకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను బూర్గంపాడు పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి విలేకరులమని చెప్పి అక్కడ ఉపాధ్యాయులను డబ్బులు డిమాండ్ చేశారు. అనుమానం వచ్చిన ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి అదుపులోకి తీసుకున్నారు. వారిని నకిలీ విలేకరులుగా గుర్తించారు. ఉపాధ్యాయురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీరు ఇటీవల కాలంలో చాలామంది వద్ద విలేకరుల పేరిట డబ్బులు వసూళ్లు చేశారని తెలిసిందన్నారు.

## మాజీ సైనికుడి ఆత్మహత్య

**జగిత్యాల - ప్రభాత సూర్యుడు**

జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామంలో బావిలో దూకి రిటైర్డ్ ఆర్మీ జవాన్ సురేందర్ ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకు మానసిక స్థితి బాగా లేకపోవడం, సురేందర్ కు కళ్ళు సరిగా కనిపించక పోవడంతోనే ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికులు భావిస్తున్నారు.

## బీఆర్ఎస్ కు తుమ్మల రాజీనామా

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

బీఆర్ఎస్ మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పార్టీకి రాజీనామా చేసారు. రెండు లైన్లు, రెండే వాక్యాలతో అయన తన రాజీనామ లేఖను ముగించారు. తెలంగాణ రాష్ట్ర సమితిలో నాకు సహకరించినందుకు ధన్యవాదములు.. పార్టీకి నా రాజీనామాను సమర్పిస్తున్నాను అంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్కు రాజీనామా లేఖ పంపారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215